క్లుప్తంగా

శాంతిభద్రతలు కాపాడాలి



పాన్‌గల్: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గిరిధర్‌ను శనివారం సాగర సంఘం జిల్లా నాయకులు, మాందాపూర్ మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, యువకులు శాలువాతో సన్మానించి, పూలె బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా శాంతిభద్రతల పరిరక్షణకు కలిసికట్టుగా పనిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌సాగర్, జి.మధుసాగర్, డి.మధుసాగర్ పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్‌ను పరిరక్షించాలని వినతి



ఆత్మకూర్: పట్టణంలోని సర్వేనంబర్ 1 లోని ముస్లింల ఖబ్రస్తాన్ స్థలాన్ని పరిరక్షించాలని స్థానిక ముస్లింలు శనివారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. అతిపురాతనమైన శ్మశానవాటికలోని సమాధులను ధ్వంసం చేసి ఎంతో విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోను సమాధులను ధ్వంసం చేశారని, ప్రస్తుతం జేసీబీ ద్వారా ఈ తంతు కొనసాగిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజు పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముస్లింలు గయాసుద్దీన్, షాహేద్, వాహేద్, ఇమ్రాన్, రియాజ్‌ఆలీ, అమీర్, ఉస్మాన్, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెబ్బేరు రూరల్: పట్టణంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో శ్రీరామ్‌యూత్ సభ్యులు శనివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. యూత్ సభ్యులను కాంగ్రెస్ వనపర్తి జిల్లా బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అక్కి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో శ్రమదానం అనే పదాన్ని అందరూ మర్చిపోయారని, స్వచ్ఛందంగా పాఠశాలలో వచ్చి శ్రమదానం చేసిన యువకుల సేవను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, గోనెల శ్రీకాంత్, గోనెల మూర్తి, సురేష్, పరమేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కొనసాగిన మధ్యాహ్న భోజనం



అమరచింత: మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వంట ఏజెన్సీ మహిళలు శనివారం తలపెట్టిన ధర్నా కార్యక్రమం వాయిదా పడటంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం యధావిధిగా అందించారు. ఐదు నెలల నుంచి వంట ఏజెన్సీలకు బిల్లులు అందటం లేదని, వీటితో పాటు గుడ్డు బిల్లులు, గౌరవ వేతనం అందటం లేదంటూ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరెట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. దీంతో శనివారం పాఠశాలలో భోజనం తయారు చేయకుండా ఏజెన్సీ మహిళలు గతంలోనే ఎంఈఓలకు వినతిపత్రాలు ఇవ్వడంతో ప్రధానోపాధ్యాయులు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించారు. తీరా ధర్నా కార్యక్రమం ముసురు వర్షాల కారణంగా వాయిదా పడటంతో విద్యార్థులకు మహిళా కార్మికులే మధ్యాహ్న భోజనం వండి వడ్డించారు.

రోడ్డుపైనే వర్షపు నీరు

చిన్నంబావి: మండలకేంద్రంలో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు చేరి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే పెబ్బేరు–కొల్లాపూర్ ప్రధాన రోడ్డుపై నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో పాటు రోడ్డుపైనే గుంతల ఉండటంతో వర్షపు నీరు నిలిచిపోతుంది. దీంతో రోడ్డుపై వాహనాలు వెళ్తేన్న క్రమంలో పక్కన్న వారిపై బురద నీరు పడుతుందోని పలువురు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వినూత్న విధానాలతో బోధన



అమడబాకుల కేజీబీవీలో బాలికల విద్యపై మాట్లాడుతున్న విద్యార్థులు

కొత్తకోట రూరల్: పోటీ ప్రపంచంలో బాలికలు చదువులో రాణిస్తూ తమదైన శైలిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారని, తల్లిదండ్రులు వారికి పూర్తి సహకారం అందించాలని అమడబాకుల కేజీబీవీ ఎస్‌ఓ చందన అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఓ చందన మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించాలంటే చదువుతోనే నెరవేతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్‌కు, టీవీలకు దూరంగా ఉంచాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువును ఆదిలోనే మాన్పించి బాల్య వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబంలో ఇబ్బందులు ఏర్పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలను కనీసం డిగ్రీ వరకు చదించాలని, అప్పుడే పెళ్లి చేసే వయస్సు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రహిమత, రాధిక, సంధ్యారాణి, ఉమాదేవి, రోజారాణి, లోకమాత, మంజుల, తల్లిదండ్రులు పాండురంగయ్య, బీచుపల్లినాయుడు, పద్మ, రాములు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: బోధనలో వినూత్న విధానాలు అవలంబించాలని ఎంఈఓ జయరాములు ఉపాధ్యాయులకు సూచించారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సెక్టోరల్ అధికారి యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసనలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వ బడుల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వామ్యం అవుతూ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు తల్లిదండ్రులకు కోరారు. శనివారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా పీటీఎం నిర్వహించడం, తల్లిదండ్రుల సంతకాలు తీసుకోవడం, విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునే అవకాశం కల్పించడం, హోం వర్క్స్ పూర్తి చేయించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.

అమరచింత: తమ పిల్లలను పాఠశాలలకు పంపడమే కాకుండా వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని ఎంఈఓ భాస్కర్ సింగ్ అన్నారు. అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ సమావేశంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం జీహెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు అదనపు గదుల అవసరం ఉందని, ప్రస్తుతం ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని వీటికోసం ఎస్ఎంసీ కమిటీ ప్రత్యేక తీర్మానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురం పాఠశాలలో..



అమరచింతలో మాట్లాడుతున్న ఎంఈఓ



కేతేపల్లి ఉన్నత పాఠశాలలో..

నీటి ప్రవాహాల వద్ద ఆటలొద్దు



జూరాల ఎడమకాల్వ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్

అమరచింత: నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద ప్రజలు, యువకులు అప్రమత్తంగా ఉండాలని, ఆదమరిస్తే ప్రాణాపాయం తప్పదని ఎస్ఐ సురేష్‌కుమార్ హెచ్చరించారు. ప్రియదర్శిని జూరాల ఎడమ కాల్వ సమీపంలో సందర్శకులతో పాటు స్థానిక చేప వంటకాల తయారీదారులకు ప్రవహించే నీటి వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుకోవడంతో ఎడమ కాల్వతో పాటు సమాంతర కాల్వ ద్వార నీటిని దిగువకు వదులుతున్నారని, కాల్వలో ఎవ్వరూ దిగొద్దని సూచించారు. కాల్వ సమీప గ్రామాలైన నందిమళ్ల, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి ప్రజలు, రైతులు నదీ పరిసరాల ప్రాంతాల్లోకి వెళ్లరాదన్నారు. ముసురు వర్షాల కురుస్తుండడంతో గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని కోరారు.

కొత్తకోట రూరల్: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాటు వాతావరణ శాఖ సూచన మేరకు మరో 48గంటలు వర్షాలు ఉన్నందున కొత్తకోట మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థకు చేరిన నివాసాలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పెబ్బేరు రూరల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వనపర్తి మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి అన్నారు. శిథిలావస్థ ఇళ్లలో నివాసముంటున్న వారు వాటిని ఖాళీ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ .అధికారులు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని కోరారు.

చదువుతోనే భవిష్యత్



మట్లాడుతున్న ఎస్ఐ శేఖర్‌రెడ్డి

మదనాపురం: విద్యార్థులు కష్టపడి చదువుకుంటే వారి భవిష్యత్‌కు భరోసా కలుగుతుందని ఎస్ఐ శేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం దుప్పల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇంటింటా చదువుల పండుగ యాప్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులు ప్రశ్న, జవాబులు చేసేటట్లు చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి పనులు చెప్పకుండా ఇంటి వద్ద హోంవర్క్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ నిరోధకం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సుధామణి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ గుప్త, ఉపాధ్యాయులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



పీహెచ్‌సీలో డాక్టర్ లేక ఖాళీ కుర్చీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్ లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఉండే ఏకైక పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా.. స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహించాల్సిన డాక్టర్ రాకేష్‌రెడ్డి డిప్యూటేషన్‌పై కడుకుంట్ల పీహెచ్‌సీలో విధులు హాజరవుతుండడంతో ఇక్కడ డాక్టర్లు లేక పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో ఉండే వెల్‌నెస్ కేంద్రాల్లో విధులు నిర్వహించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీలతో తూతూమంత్రంగా వైద్యం అందిస్తున్నారు. వీరు కూడా మధ్యాహ్నం వరకు వెళ్లిపోతుండటంతో ఉన్న సిబ్బందే దిక్కయ్యారు. దీంతో అత్యవసర సమయంలో పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. పీహెచ్‌సీకి రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన లేదని మండల ప్రజలు అసహనం వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పీహెచ్‌సీకి రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించి మెరుగైన వైద్యం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం.. పట్టించుకోని అధికారులు



కొత్తకోట పట్టణంలో నివాస గృహాల మధ్య పెంటకుప్పలు

కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసింది. మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు ప్రధాన రోడ్లపైకి రావడంతో బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం ఫొటోలకు ఫోజులిస్తున్నారే తప్ప.. ఎక్కడ కూడా కార్యరూపం దాల్చడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, అంతే కాకుండా ఇళ్ల పక్కనే పెంట కుప్పలు వేస్తున్నారని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందని, అధికారులు జోక్యం చేసుకుని పెంటకుప్పలను తరలించాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా ఇళ్ల పక్కన గల ఖాళీ స్థలాల వారికి స్థలాన్ని శుభ్రంగా పెట్టుకోవాలని నోటీసులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ పట్టణంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని పలు కాలనీవాసులు అంటున్నారు.

మున్సిపాలిటీలో సహాయక కేంద్రం ఏర్పాటు



అమరచింత: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా సహాయక కేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. పట్టణంలోని పది వార్డుల్లో మట్టిమిద్దెలు, వర్షాలకు కురుస్తున్న ఇళ్ల వివరాలను తెలుసుకుని వారి ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను సహాయక కేంద్రాలకు తరలించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. పట్టణంలోని కమ్యూనిటీ కేంద్రాల్లో ప్రజలు నివసించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర సేవల కోసం 99631 26840, 96422 53317 సెల్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిచాలని కోరారు.

నేడు సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

కొత్తకోట రూరల్: పట్టణ శివారులో గల సంకల్ప సిద్ధి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం 7గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సాయిబాబ మూలవిరాట్‌కు పంచనది జలాలతో, పంచామృతంతో, పంచవర్ణాలతో అభిషేకం నిర్వహించడంతో పాటు సహస్ర పుష్పార్చన, నిరాజన, మంత్రపుష్పార్చన చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని, పెద్ద ఎత్తున వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పల్లకీసేవ, రాత్రి 9గంటలకు శేజహారతి పిదప భక్తులకు అల్పాహారం ఉంటుందన్నారు.

కూలిన మట్టిమిద్దె.. తప్పిన పెనుప్రమాదం



పెద్దమందడి మండలంలోని పిల్లికుంటతండాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ తిరుపతయ్య



ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న బాధిత దివ్యాంగురాలు రజియాబేగం, కుటుంబ సభ్యులు



మోట్లంపల్లిలో వర్షానికి కూలిన ఇళ్లు

కొత్తకోట రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు పట్టణ కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన బీడీ కార్మికురాలు రజియాబేగంకు చెందిన మట్టిమిద్దె శనివారం ఉదయం కూలిపోయింది. మిద్దె కూలినప్పుడు కుటుంబ సభ్యులు బయట ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. దివ్యాంగురాలైన రజియాబేగం మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని, తమకు ఉన్న ఇల్లు కూలిపోవడంతో ఉండేందుకు చోటు లేదని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. మిద్దె కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ ఖాజా, ఇతర పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పెద్దమందడిలో..

పెద్దమందడి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కూలిపోయిన ఇళ్లను ఆర్ఐ తిరుపతయ్య పరిశీలించారు. మండల కేంద్రానికి చెందిన చాకలి చిన్నబాలస్వామి, పిల్లికుంటతండాకు చెందిన కేతావత్ రాకేష్, వీరాయిపల్లికి చెందిన మెకానిక్ చెన్నయ్య నివాస గృహాలు ముసురు వానలకు కూలిపోయాయి. బాధితుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్ఐ తిరుపతయ్య తెలిపారు.

ఆత్మకూర్: మండలంలోని మోట్లంపల్లిలో బాలరాజుకు చెందిన నివాస గృహం కూలిపోయింది. ఈమేరకు శనివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ బృందం, ఎంపీడీఓ సుజాత బృందం ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. శిథిలావస్థ ఇళ్లలో నివసిస్తున్న వారు సురక్షితంగా ఉండేవిధంగా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్, ఎంపీడీఓ సుజాత అన్నారు. కృష్ణనదీతీర గ్రామాల్లోని రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం పెరుగుతుందని నదీతీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు



ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో కల్వర్టు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, ఈవిషయమై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో మాట్లాడినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం సాక్షి ఫోన్ ఇన్‌లో పలువురు ఈవిషయాన్ని కమిషనర్‌తో ప్రస్తావించిన నేపథ్యంలో శనివారం వార్డుల అధికారులతో కలిసి ఆయన గాంధీ చౌక్‌లోని డ్రెయినేజీని పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణం ఇదివరకే పూర్తయిందని, డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణం కోసం ఏఈతో సంప్రదించి ప్రతిపాదనలు పంపించామన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఖిల్లాఘనపురం: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలలు, ఎస్టీ ఆశ్రమ పాఠశాల, మామిడిమాడ ఉన్నత పాఠశాల, గణపముద్రం చెరువు పనులను ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన సొంతంగా రూ.5 లక్షలు హెచ్‌ఎం ఖాతాలో జమచేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, జిల్లా మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

గణపసముద్రం చెరువు పనుల్లో వేగం

గణపసముద్రం చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులను వేగంగా నాణ్యతతో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. శనివారం చెరువు వద్దకు వెళ్లిన ఆయన పనులను పరిశీలించి, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకటేశ్వర్‌వు, సాయిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, క్యామ రాజు, గంజాయి రమేష్, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ సమస్యల పరిష్కారానికి చర్యలు

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో కల్పిస్తున్న వసతుల గురించి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రికార్డు, మందుల స్టాకు, ఆస్పత్రిలో పరిశుభ్రత, ఓపి తదితర వాటిని పరిశీలించారు. ఆస్పత్రిలో కనీసం 8 మంది వైద్యులు, ఐదుగురు ప్రత్యేక వైద్యనిపుణులతో కలిసి మొత్తం 55 మంది ఉండాలని వైద్యాధికారి మేఘన చిన్నారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కేవలం ముగ్గురు వైద్యులు, ఆరుగురు నర్సులు మాత్రమే ఉన్నారనిఫార్మాసిస్టు రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ముదిరాజ్‌లకు న్యాయం చేయాలి

పెబ్బేరు రూరల్: ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి తొలగించి బీసీ ఏ గ్రూప్‌లోకి చేర్చాలని శ్రీరంగాపురం మండలంలో ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



కనిమెట్టలో..



కేతేపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ

పాన్‌గల్: చిన్నారులు కేంద్రాలకు సక్రమంగా వచ్చే విధంగా పనిచేస్తూ.. కేంద్రాల బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. శనివారం కేతేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పూర్వ బాల్యదశ సంరక్షణ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్య బోధన అందించేందుకు అడుగులు వేస్తుందన్నారు. కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచడానికి ఆట, పాటల ద్వారా అందించే విద్య దోహదపడుతుందని తెలిపారు. గర్భిణులు పోష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. చిన్నారులకు అక్షరాభాస్యం చేయించారు. కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహించే కార్యకర్తలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సూపర్‌వైజర్ షాహీన్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్ష్యరాభ్యాసం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మూడో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, తల్లుల కమిటీ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్యను ప్రవేశపెట్టడం సంతోషకరమని తల్లులు అన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నర్సరీ నుంచి ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టిందని టీచర్ మంజులారాణి తెలిపారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనురాధ, ఆశావర్కర్ జ్యోతి, కవిత, ఉష, కవిత, రవళి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో శనివారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భారతి పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఏఎస్ఎం శ్రీదేవి చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం-1 ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి చిన్నారులకు శనివారం గ్రామంలోని రామాలయంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. తల్లుల సమక్షంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు.